# ఆపరేషన్ సక్సెస్

- ఎనుగంటి వేణుగోపాల్

ఆ కూర కంట పడగానే ఫైరంటినట్టు ఒళ్లు మండింది గోపాలానికి. వీలైనంత వాల్యూమ్ పెంచి, "బుద్ధుందా నీకు?" అంటూ వాలీబాల్‌లా ఎగిరెగిరి పడ్డాడు.

భర్త పక్కనే నిలబడిన అనిత అమాయకంగా మొహం పెట్టి, "మిమ్మల్ని కట్టుకున్నాక పదే పదే నాకదే డౌటొస్తుందండీ!" అంది తెలివిగా

మకతికయ్యాడు...అర్థమై, అవక! ఆ కోపం, ఈ కోపం కలగలిపి "బెండకాయ పులుసుపెట్టి తగలడ్డావేం? నే ఫ్రై చేయమన్నాగా?" పిసికిన చపాతీ పిండిలా డిఫరెంట్‌గా ఫేసెట్టి... హుంకరించాడు.

"బాగా ముదిరాయండీ... ఫ్రై చేస్తే తినలేమని..." భయాన్ని ప్లే చేసింది అనిత.



"బెండని ఫ్రై చేస్తే నాకు మింగుడు పడదని తెలుసుగా?" కోపంతో ఊగిపోయాడు గోపాలం.

ఊగి ఊగి ఆ ఊపులోనే డైనింగ్ టేబుల్ మీదున్న కూర గిన్నెను అరచేత్తో బలంగా విసిరికొట్టాడు.

అది స్టార్ వార్స్ సినిమాలోని ఫ్లయింగ్ సాసర్‌లా పల్టీలు కొడుతూ వెళ్లి, గోడతో బాక్సింగ్ చేసింది. కూరంతా రంగుల ఫౌంటెన్‌లా విరజిమ్మింది.

అనిత ఎక్స్‌పెక్ట్ చేసినట్టే అయ్యింది! నచ్చనిది జరిగితే గోపాలం ఇలాగే విరుచుకు పడిపోతాడు. హయ్యెస్ట్ రేంజ్‌లో రియాక్టవుతాడు. అనవసరంగా హైప్ బ్రాండ్ ఫైరైపోతాడు. వస్తువేదని చూడకుండా విసిరికొడతాడు.

గోపాలానికి ఇంటరెస్ట్ ఉందో లేదో తెలీదు కానీ, రేప్పొద్దున లండన్‌లో జరగబోయే ఒలింపిక్స్‌కి పంపితే, విసిరివేసే కొత్తరకం ఆటలుంటే గనక, రకరకాల యాంగిల్స్‌లో గెలిచేసి పసిడి పత కాల్ని రెండు చేతుల్నిండా ఇట్టే పట్టుకొచ్చేస్తాడు.

గమ్మత్తేమంటే ఈ సారి రివర్సయ్యింది. గ్రహాలు అనుకూలించ నట్టున్నాయ్.

గోడకు తగిలిన గిన్నె, బ్యాట్‌కు తగిలిన షటిల్ కాక్‌లా, నా బుజ్జి కూరను పారపోస్తే నేనూరుకుంటానా అనే టైపులో, స్టంట్ సీన్‌లోని వైర్ వర్క్‌లా రయ్‌మని వెనక్కి దూసుకువచ్చి.... ఫ్ఫ్! గోపాలం నుదుటిని టప్‌మని ఢీ కొట్టింది. గోడకి దగ్గరగానే కూర్చున్నాడు మరి.

'కెవ్వ్'మని కేకేశాడు. మరీ బలంగా ఏం తగల్లేదా గిన్నె. అతను అరిచింది కూడా దెబ్బకి కాదు.

పడిపోగా గిన్నెలో మిగిలిన కూరంతా ఇంటి ముందు పేడ అలికినట్టు మొహం మీద చిందింది.

హతోస్మి! అయ్యగారి పనయ్యిందిలా.

సెకనుకు 180 కి.మీ.ల వేగంతో వస్తోన్న నవ్వును గమ్మున నోట్లోనే నొక్కేసింది అనిత. అయ్యబాబోయ్! ఆమె గనక భళ్లున నవ్వితే ఇంకేమైనా వుందా? తింగరి గోపాలం మరింత తిక్కతిక్క చేసేయడూ?

"బెండ బండబడ!" అని ధుమధుమలాడుతూ చెయిర్ మీద నుండి జంప్ చేశాడు. కడుక్కోవడానికి మరో గదిలోకి బయల్దేరాడు.

ఏదైతే జరక్కూడదనుకుంటాడో, గోపాలం విషయంలో అదే జరిగి తీరుతుంది. ఇపుడదే జరిగింది కూడాను.

గాలిపటంలా హుషారుగా ఎగురుకుంటూ ఎదురయ్యాడు, చంటి ఉరఫ్ జూనియర్ గోపాలం. మహా గడుగ్గాయి వాడు. పక్కింటి బుజ్జిగాడి ఫంక్షన్‌కి ఓ రౌండేసి వస్తున్నాడు. పొరపాట్న గోపాలమే వాడి నోట్లో నోరెట్టడు!

కార్టూన్ నెట్ వర్క్‌లోని క్యారెక్టర్‌లా... పులుసంతా మొహం మీది నుండి కారుతుంటే... తమాషాగా కనిపిస్తున్న తండ్రినలా సడెన్‌గా చూసేసరికి భలేగా నవ్వొచ్చింది చంటికి. తండ్రి జుట్టు లోంచి ఊడిపడ్డాడు వాడు. కాకపోతే కామెడీ పంచ్‌లిస్తుంటాడు. తండ్రిని టామీని చేసి తను జెర్రీలా ఆటలాడేస్తాడు. తండ్రి తింగరి వేషాల్లో ఫస్టయితే, ఈ జూనియర్ డింగరి విషయాల్లో బెస్టన్నమాట.

"డాడోయ్! మన బర్త్ డే అయితే కేకుని సరదాగా మొహానికి పూస్తారని తెలుసు. పక్కింటి వాళ్ల బర్త్ డే అయితే ఫన్నీగా ఫేసంతా పోసుకోవడం లేటెస్ట్ ట్రెండా?" గడుసుగా అడిగి, తండ్రికి చిక్కకుండా పక్కకు తిరిగి పరుగో పరుగు!

పులుసుపడి కళ్లు మండుతున్నా "ఇప్పుడైతే తప్పించుకున్నావ్! ప్రొగ్రెస్ కార్డ్ పట్టుకొని రాకపోతావా? అప్పుడు దులుపుతాన్లేరా, నీ బూజు", కసిగా పళ్లు నూరబోతుంటే, నాలికిరుక్కుంది పళ్ల సందున.

"వామ్మోయ్!" అనరుస్తూ జెర్రీ వెంటపడ్డాడు.

వాడు చిక్కేనా? ఎంచక్కా ఎప్పుడో తుర్రుమన్నాడు. బెడ్రూమ్‌లో దూరి తలుపులు బిడాయిం చేసుకున్నాడు.

ఒక్కటంటే ఒక్క పరుగూ చేయకుండానే ఔటయి, మొహం వేలాడేసుకుంటూ మడమ తిప్పిన క్రికెటర్‌లా గోపాలం బాత్రూమ్‌లోకురికాడు.

అన్ని విషయాల్లో అనితతో బానేవుంటాడు గోపాలం. ఈ వీర విసిరికొట్టుడనే దొక్కటే యమ వీక్నెస్. మనిషిది మంకుపట్టు. చిమచిమలాండిచే చీమ కుట్టు. చెప్పింది చేయాలి. అన్నదే జరిగి

తీరాలి.

తల ప్రాణం జడలో కొస్తోంది అనితకు.

పలుమార్లు భర్త 'పైత్యానికి' అల్లపు మురబ్బా విరుగుడు ఆలోచించక పోలేదామె. అదను కోసం చూస్తోందంతే!

000

రొటీన్‌గా బయటకు వెళ్లడానికి రెడీ అవుతున్నాడు గోపాలం.

బయట రూమ్‌లోకొచ్చి షెల్ఫ్ లోంచి షూ తీశాడు. చూస్తే ఏముంది? సాక్స్ ఎంచక్కా జోగాడున్నాయందులో. చుర్రు మంది గోపాలానికి.

"అనూ!..." బ్రహ్మ చెవుడున్నవాళ్లక్కూడా అలఫ్ సడెన్‌గా, కర్ణభేరి రీచార్జయి, ఆ సౌండ్ వినపడేంత యమ 'ఘట్టిగా' అరిచాడు.

డిజిటల్ సౌండ్‌లు అలవాటైన అనిత, షరా మామూలుగా మొహంలో భయాన్ని కూరుకుంటూ, పరుగు పందెంలో రికార్డ్ బ్రేక్ చేసేవారి కంటే ఫాస్ట్‌గా వాలిందక్కడ.

"షూ లేనిదే అడుగు బయట పెట్టనని తెల్సుగా?" గొంతుకే కాదు, కళ్లకి కూడా స్పెషల్ ఎఫెక్ట్స్ ఇచ్చాడు.

"అందుకే కదండీ... రెండు జతల షూసున్నాయి..."

సాక్స్ తీసి చేత్తో పట్టుకుంటూ కవరేజ్ ఏరియాలో కొచ్చేశావ్ గానీ, నిన్న మొన్న వేసుకున్ ఈ మాసిన సాక్స్ ఎలా వేసుకుని తగలడమంటావ్?" చిటపట చిందులేశాడు.

"ఓ అరడజను తెచ్చి పెట్టమంటే వినరు..." గొణిగింది.

"అరడజనేం ఖర్మ! 'షాపే' ఇంట్లో పెడదామంటే బ్యాంకు వాళ్లే లోనివ్వట్లేదు మరి! మొహం చూడు మొహం! నాకు తెలియకనా? మన ఖాతా వాడి షాపులో స్టాకు లేదుట. వచ్చాక ఇస్తానన్నాడు. ఏ రోజువా రోజు ఉతికిచావక్కర్లేదా? ఏంటిది...?" అంటూ చెడామడా వీణ వాయించేస్తూ సాక్స్‌లని బలంకొద్దీ విసిరికొట్టాడు, పిచ్చుకని ఫిరంగితో పేల్చినట్టు, డాంబికంగా.

ఆ విసరడంలో చేయి కాస్త టింగుమని స్ప్రింగులా పైకి లేచింది. దీపావళి రాకెట్స్‌ని మింగినట్టు అవి మరింత పైపైకి దూసుకుపోయాయి. అందులోంచి ఓ సాక్స్ తలొంచుకొని నెమ్మదిగా కిందికి దిగింది, ప్యారాచూట్‌లా.

"అవి ఏమయ్యాయబ్బా?" అని ఆశ్చర్యపోయిన గోపాలమప్పుడే సడెన్‌గా తలెత్తాడు. ఆ సాక్సొచ్చి ఏకంగా గోపాలం మొహం మీద వయ్యారంగా వాలింది... గాలి పాటలో హీరోయిన్ చున్నీ ఎగిరొచ్చి హీరో మొహాన్ని కప్పేసినట్టు.

"ఛ ఛ! వెధవన్నర వెధవ సాక్స్!" విసుక్కుంటూ మొహాన్ని దులుపుకున్నాడు. దాని కంపుకి డోక్కోబోయే సీన్‌ని తాత్కాలికంగా వాయిదా వేస్కున్నాడు.

"నన్నెగరేస్తే నే గాలిపటమై ఎగరనా?" అన్న చందాన రెండో సాక్స్, ఫ్యాన్ గాలికి సరాసరి వెళ్లి గోడకున్న మేకుకి తగులుకొని ఆగింది గమ్మున.

విసావిసా వెళ్లి ఎత్తులో ఉన్న మేకుకు చిక్కుకున్న ఆ సాక్స్‌ని చేత్తో పట్టుకొని, వెనక్కి తీయబోయి కిందికి లాగాడు. ఇంకేముంది? బర్‌ర్ మంటూ చిరిగిందది.

"అనుకున్నదొక్కటీ... అయ్యింది ఒక్కటీ..." అనే సాంగ్ సిచువేషన్‌కి తగ్గట్టు బయట నుండి జోరుగా వినపడింది.

"ఎవడ్రా ఆ పాట పాడేది? వెటకారంగా వుందా?' చిర్రుబుర్రు లాడుతూ గోపాలం సర్రున బయటకొచ్చి, గుడ్లు మిటకరించి చూస్తే ఏముంది? ఎవరూ పాడడం లేదు... రికార్డది!

సాంగ్‌కి స్మాల్ బ్రేకిస్తూ, మధ్యమధ్యలో "కర్‌మురీ! ఆ... కర్‌మురీ!" అనరుస్తూ పల్లీల బండిని ముందుకు తోసుకుపోతు న్నాడు బండాయన.

సీరియస్‌గా వెనుదిరిగి ఇంట్లోకి దూరబోయాడు గోపాలం. విధి వక్రించడమంటే ఇదేనేమో... ఓ రబ్బరు బాలొచ్చి, అతగాడి బ్యాక్ సీటుకు వెయ్యి టన్నుల బరువు గల రాయిలా బలంగా తాకింది. చిత్తడయ్యాడు గోపాలం. చురుక్కుమని మండింది.

"చచ్చానోయ్...!" చావు కేకేసి వెనుదిరిగి ఆ పావనప్రదేశాన్ని అరచేత్తో రుద్దుకోసాగాడు.

ఎవరో కుర్రాడు గోపాలం వైపే పరుగెత్తుకొస్తున్నాడు వాయు వేగంతో! వాడిని గురి చూసి బంతి విసిరితే గురి తప్పి మన కథానాయకుణ్ని తగులుకుం దన్నమాట!

ఈ సీన్‌ని కనులారా క్లోజప్‌లో చూసిన బుజ్జిగాడు, తనకి తగలాల్సిన దెబ్బ అంకుల్‌కి తడలడంతో ఝడుసుకొని గిర్రున వెనుదిరిగి, ఒలింపిక్స్‌లో బంగారు పతకం గెలుచుకునేవాడిలా స్పీడ్‌గా రన్నింగో రన్నింగ్.

"అరిచారా... తుపాల్, తుపాల్... పిలిచారా?" ఓ లీటరు వినయాన్నొలకబోసింది. భార్యామణి పదప్రయోగానికి కళ్లు చిట్లించి గుర్రుగా చూశాడు. తలొంచుకొని కళ్లెత్తి చూసింది, భర్త వంక సూపర్ అమాయకంగా. "నీ తుపాల్ తుపానెత్తుపోను! అర్థమైందర్థమైంది. నేన్నీకు అరచేవాడిలా కొండొకచో కరిచేవాడిలా కనిపిస్తున్నానన్నమాట...!" అంటూ అంతెత్తున అరిచాడు మళ్లీ.

మరి బంతినంత బలంగా విసిరి గోపాలానికి మెంటలెక్కేలా చేసిందెవరో కాదు... స్వయానా అతగాడి సన్నే. చంటి, మరోసారి, మరోసారైతే ఫాదర్‌ని 'ఢీ' కొనేవాడు. సీన్ యమ సీరియస్‌గా ఉంటుందని గెస్ చేసి, ప్లాన్ మార్చేసి, తుపాకి గుండులా తుర్రుమన్నాడు.

"రాత్రికి చిక్కకపోతావా సన్నూ? అప్పుడు పెడతారా నీ లగ్గానికి ముహూర్తం!" చిటపటలాడుతూ, 'ఈ సమ్మర్‌లోనైనా ఇంటికి కాంపౌండ్ వాల్ పెట్టించాలి' అనుకొన్నాడు.

మొహం కందగడ్డలా పెట్టేసుకొని ఆ వేళ్లికి చెప్పుల్లో సరిపెట్టు కుంటూ బయటపడ్డాడు.

"అనూ...!" గొంతు పెగల్లేదు గోపాలానికి. అరిగిపోయిన సీడీలా కీచుమంది.

శాంతంగా వున్నపుడు భార్యను 'హనీ' అంటూ ప్రేమగా, ముద్దుగా పిలుస్తాడు. అదే తిక్కరేగినపుడు 'అనూ' అని అరుస్తాడు.

ఆమెకదే సిగ్నల్. మూడ్‌ని బట్టి మూవ్ అవుతుందన్నమాట. లేదంటే తినేయడూ?

ఈ సారి యమ గట్టిగా ఊపిరి పీల్చేసి, "అనూ...!" అని కేకేయడంలో సక్సెసయ్యాడు.

శ్రీవారిని చేరడం లేటైతే మళ్లీ ఎక్కడ కొంపలంటుకుపోతాయో నని, బెడ్ రూమ్‌లో ప్రత్యక్షమయ్యింది చేతిలో కాఫీ కప్పుతో. ఆఫీసుకు పోయేముందు రెండవసారి కాఫీ తాగడం అలవాటు గోపాలానికి.

"అరిచారా... తుపాల్, తుపాల్... పిలిచారా?" ఓ లీటరు వినయాన్నొలకబోసింది.

భార్యామణి పదప్రయోగానికి కళ్లు చిట్లించి గుర్రుగా చూశాడు. తలొంచుకొని కళ్లెత్తి చూసింది, భర్త వంక సూపర్ అమాయకంగా.

"నీ తుపాల్ తుపానెత్తుపోను! అర్థమైందర్థమైంది. నేన్నీకు అరచేవాడిలా కొండొకచో కరిచేవాడిలా కనిపిస్తున్నానన్నమాట...!" అంటూ అంతెత్తున అరిచాడు మళ్లీ.

"ఇపుడు తమరు చేసిందదే కదా మహాశయా!" గొణుక్కుంది.

బెడ్ మీదున్న టీ షర్ట్‌ని చేతులోకి తీసుకుంటూ, "ఆఫీసుకి నేను టీ షర్టు వేయనని తెలిసీ...." డైలాగ్ పార్ట్ కంప్లీటవకుండానే షరా మామూలుగా యాక్షన్ పార్ట్‌లోకి ప్రవేశించబోయాడు.

"ఇస్త్రీ బట్టలు లేవండీ..." భార్య మాట పట్టించుకోలేదు.

ఈ సరికే సీను మీకు అర్థమై ఉంటుంది. టీ షర్ట్‌ని విసిరికొట్ట

బో...యా...డు...!

భర్త ముందు బొమ్మలా నిలబడిన అనిత, బెదురుబెదురు చూపులు చూడసాగింది.

ఠక్కున ఆగిపోయాడు గోపాలం. పైకి లేపిన చేతిని స్లో మోషన్‌లో తొలిసారిగా... ఎత్తినది ఎత్తినట్టే కిందికి దించేశాడు, విచిత్రంగా... అక్కడ రాకుమారుడు పుటుక్కున రామచిలక చేయి విరవగానే ఇక్కడ మంత్రదండం ఎత్తిన మాంత్రికుడి చేయి చటుక్కున కిందికి వేలాడిపోయినట్టు!

భర్త రుద్రతాండవం స్కీమ్‌ని ఓపెన్ చేయకముందే... వణికిపోతూ నిలబడిన అనిత చేతులు క...క...కంపిస్తుంటే, కాఫీ కప్పు చేజారిపోయింది. ఇకనేం? జరగాల్సిన ఘోరం జరిగేపోయింది. భళ్లుమని రీసౌండ్ చేస్తూ కప్పు బాడీ వేయివక్కలై పోయింది. దాని జీవితం అలా ముక్కలుముక్కలైంది...!

ఆ అకాలచర్యకూ, సౌండ్‌కూ, గుండెలో చువ్వ పెట్టి గెలికినట్టయ్యింది. గుండె దడదడలాడింది.

చర్యకు ప్రతిచర్యలా... సీను రివర్సయ్యింది!

ఝుడుసుకున్నాడు మనవాడు. ఝుడుసుకోవడమే కాదు డీలా పడిపోయాడు కూడా.

కప్పు అలా పగలడం... గోపాలం చేయెత్తడం... సినిమా షాట్‌లా కో-ఇన్సైడయ్యాయన్నమాట! అందుకే మరి, ఎత్తిన చేయి ఎత్తినట్టే కిక్కురుమనకుండా దించేశాడు.



కప్పు పగిలాక సింబాలిక్‌గా తన ఫీలింగ్స్ ఉండాలని దిగాలుగా మొహం పెట్టింది అనిత.

భార్య మీద బాంబేయలేక అదురుతున్న గుండెతో, "ఎంత హడలి చచ్చానే...! కాస్త కప్పు దగ్గర పెట్టుకో... థూ థూ...! ఒళ్లు దగ్గర పెట్టుకో..." మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి, నిన్నటి షర్ట్‌తోనే తయారై హడావుడిగా ఆఫీసుకి వెళ్లిపోయాడు, "మరో కప్పుతో కాఫీ తెస్తా తాగి వెళ్లం"డని భార్య పిలుస్తున్నా వినిపించుకోలేదు.

శ్రీవారటు వెళ్లగానే యాక్షన్‌కి 'పూరా' బ్రేకిచ్చి అరుపు నీసారి అనిత 'టేకప్' చేసింది డి.టి.ఎస్. సౌండ్‌కే బిల్లులు పడేంత బిగ్గరగా, "ఆపరేషన్ నంబర్ వన్ సక్సెస్!" అని.

000

టూ మచ్ సిన్సియర్‌గా, సాయంత్రం అయిదుం పావుకే, చుక్క తెగిపడ్డట్టు, ఆఫీసు నుండి ఊడిపడ్డాడు గోపాలం.

తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. అలా తెరిచి ఉంటే నచ్చదతనికి కళ్లెర్ర జేశాడు. పైత్యం ప్రకోపించింది. పళ్లు నూరాడు.

చిమచిమలాడుతూ లోనికి దూరేసరికి, గదంతా అస్తవ్యస్తంగా దుమ్ముకొట్టుకుపోయి, చీపురు స్పర్శ లేక, చిన్నబోయి ఉంది. లిక్కర్ తాగకుండానే కిక్కెక్కినట్టయ్యిందతనికి.

గొంతుని గాండీవం చేసి అరుపుని ఎక్కుపెట్టాడు. ఇకనేం..., ఉన్న పళంగా అనిత అక్కడ హాజరు!

"ఏవిటిది?" చిందులేశాడు.

పతి మూడ్ పాడు చేయడం సతికి పాటి కాదని, "సిరికిన్ జెప్పడు..." పద్యాన్ని రివర్స్ చేసినట్టు చేతిలో ఉన్నవి ఉన్నట్టుగానే పదిలంగా పట్టుకొచ్చేసిందామె కంగారులో. కిచెన్‌లో వాషింగ్ వర్క్' లో బిజీగా ఉంది మరి. "వాటర్ జగ్ అండీ...ఐ" అంది బేలగా.

గదిలో కునుకు తీస్తున్న చెత్తా, చెదారం వంక సీరియస్‌గా లుక్కేసి చూపిస్తూ "నేనన్నది ఇదేమిటని?" కరెంటు క్యాదు... కరెంటు బిల్లు చూసి షాక్ కొట్టినవాడిలా అతిగా వైబ్రేటయ్యాడు.

సేమ్ సీన్..

అనిత వణికిపోయింది. చేతులు కంపించాయి. చేజారిన గ్లాస్ జగ్ భళ్లున కిందపడి పగిలి పదివేల ముక్కలయ్యింది.

లిక్కర్ తాగకుండానే లివర్ డ్యామేజ్ అయిన పేషెంట్‌లా, వర్రీ అయ్యాడు గోపాలం. విసరబోయిన చేతిలోని బ్యాగ్ చేతిలోనే భద్రంగా బిగుసుకుపోయింది. ఆ పగిలిన శబ్దానికి గుండె అదిరిపోయింది.. మనిషి డీలా పడిపోయాడు.

"సర్సరే! ఆ పనయ్యాక ఈ పని కానిచ్చేసెయ్!" నీర్సంగా అనేసి లోపలికి దూరిపోయాడు.

అనిత ఆనందంతో అంతెత్తు కెరిగింది... వర్షపు పాటలో హీరోయిన్‌లా సంబరంలా గంతులేసింది.

ఆపరేషన్ టూ సక్సెస్..!

000

సండే సాయంత్రం అనిత పప్పు గారెలు మూకుట్లో వేస్తోంది.

డైనింగ్ దగ్గర గోపాలం వేడిగా తిందామని వెయిట్ చేస్తున్నాడు. ఆకలి 'లకలక' లాడుతోంది.

మొదటి వాయి అయ్యాక, "డాడీ కివ్వరా!" అని చంటిగాడి కిచ్చి పంపింది.

కిచెన్ టు డైనింగ్ గ్యాప్‌లో, ఆకతాయిగా వాడింత సాల్టేశాడు, గారెల మీద. తండ్రి కిచ్చేశాడు. వెళ్లి కిచెన్ డోర్ దగ్గర నిలబడి నక్కినక్కి చూడసాగాడు. మమ్మీకీ, డాడీకీ, బలేగా ముడేశానన్న ఆనందం వాడిది! జరగబోయే తమాషా కోసం వెయిట్ చేయసాగాడు.

"వింటే భారతమే వినాలి సీడీలో. తింటే మా హనీ చేతి గారెలే తినాలి" అని హమ్ చేస్తూ... నీళ్లూరుతుంటే ఆపుకొని, గారెని తుంచి ఓ ముక్క నోట్లో వేసుకున్నాడు

ఆ విషానికి తాతలు దిగొచ్చారు. మనవాడి ప్రాణం కైలాసం చేరింది.

అంతే!

సీను చకచకా మారిపోయింది. జస్ట్... ఈ సారి డిఫరెంట్‌గా.

'శివ'లో చేత్తో చెయిన్ పైకి లేచినట్టు, ఈ టిఫిన్ ప్లేట్ గాల్లో కెగరలేదు.

"మమ్మీ పని మటాష్!" సంబరంగా అనుకుంటూ, సౌండ్ రాకుండా చప్పట్లు కొట్టడానికి రెడీగా ఉన్నాడు చంటిగాడు. మిర్చీలు చేయమంటే డాడీకిష్టమని పప్పు గారెలు చేస్తోంది. అదే వాడి అక్కసుకి కారణం.

"హనీ! ఒరేయ్ హనీ... గారెల్లో సాల్ట్ ఎక్కువైందిరా!" వెరీ సాఫ్ట్‌గా, తేనె తాగినంత తీయగా, మృదువుగా పలికాడు గోపాలం. గతంలో గోపాలం వీరంగాన్ని ప్రత్యక్షంగా చూసినవారెవరైనా, ఈ తతంగం చూస్తూ... గుండె పోటు వచ్చేలా!

"అరెరె! సారీ అండీ... వచ్చేస్తున్నా" నొచ్చుకుంటూ, ఓ నిమ్మకాయ ముక్క కోసుకొని, క్షణంలో తెచ్చి భర్తకందించింది ప్రేమగా.

ఏదేదో ఆశపడిన చంటిగాడు భంగపాటు జరగడంతో, "ఓ షిట్! నా ప్లానే బెడిసికొట్టింది!" చిన్న బుర్ర తడుముకుంటూ వెళ్లి టామ్ అండ్ జెర్రీ కోసం టీవీ ముందు చతికిల పడ్డాడు.

ఇప్పటికి మీకర్థమై ఉంటుంది... వరస ఆపరేషన్ల వరదతో అనిత భర్త 'హ్యాండ్ సెట్'ని మార్చేసింది.

అలా గోపాలం మైండ్ సెట్ అయ్యిందిపుడు!